


మోటార్లకు మీటర్లు బిగించొద్దని నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించవద్దని, బిగిస్తే ఊరుకోబోమని రైతులు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని చెక్కపల్లి విద్యుతు సబ్ స్టేషన్ వద్ద చెక్కపల్లి, రమణక్కపేట, సూరేపల్లి, అక్కిరెడ్డిగూడెం, పలు గ్రామాల రైతులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగిస్తే ఊరుకునేది లేదన్నారు. మోటార్లకు మీటర్లు బిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని విద్యుత్ అధికారులు చెప్పారు.



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వైద్య ఆరోగ్య శాఖ రూటే వేరు..!



- వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా డిఎంహెచ్ఒ కార్యాలయం
- హాట్‌టాపిక్‌గా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల బదిలీల వ్యవహారం
- కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తిస్తాయా
- ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరించినట్లు ఆరోపణలు
- ఎన్నికల కోడ్‌లో ఉద్యోగుల చేతికి బదిలీ ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు తమరూటే వేరన్నట్లు వ్యవహరిస్తున్నరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి ఇష్టం లేని వారిని బదిలీలు చేయడం, ఇష్టం ఉన్నవారిని డిప్యూటేషన్ల పేరుతో నియమించడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేసే అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లలోని 16 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆకస్మాత్తుగా బదిలీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తించవని తెలిసినా కక్షపూరితంగా కావాలనే ఎన్‌యుఎంలోని ఉద్యోగులను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను పరిశీలిస్తే అనేక విషయాలు పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఏలూరు పట్టణంలోని గజ్జలవారిచెరువు, కొత్తపేట, జెపికాలనీ, లంబాడీపేట, పవర్‌పేట, వెంకటాపురం, మోతేవారితోట వంటి అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న 16 మంది ఉద్యోగులను ఉన్నట్టుండి చింతలపూడి, ఏలూరులోని పలు సెంటర్లకు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వుల్లో అధికారులు చెప్పిన కారణాలు ఏమిటంటే 2024 ఫిబ్రవరి 19న ఎన్‌హెచ్ఎంలోని అధికారైన జిల్లా ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లకు తనిఖీలకు వెళ్లగా అక్కడ కొన్ని సమస్యలు గుర్తించారని, ఆ కారణంగా అందుకు కారణమైన ఉద్యోగులను బదిలీ చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఉద్యోగులు తప్పు చేసినట్లు గుర్తిస్తే ముందుగా మెమో లేక నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అటువంటిదేమీ ఇక్కడ జరగలేదు. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తనిఖీ చేసిన తేదీన ప్రోగ్రాం కోఆర్డినేటర్ తనిఖీలకే వెళ్లలేదని తెలుస్తోంది. వెళ్లినట్లు రిజిస్టర్‌లో సంతకాలు ఎక్కడా లేవని సమాచారం. ఒకవేళ వెళ్లినా మెమో, నోటీసు వంటివి ఇచ్చి ఉద్యోగుల నుంచి సంజాయిషీ కోరడం వంటి ఏఒక్క ప్రక్రియ చేపట్టలేదు. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిసి కోడ్‌కు ఒక్కరోజు ముందు 15న ఉద్యోగులను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం ఎన్నికల కోడ్ వచ్చాక ఉద్యోగులకు బదిలీల ఆర్డర్ ఇవ్వడం గమనార్హం. ఈ వ్యవహారం చూస్తే ఇదంతా ఒక గూడుపుఠాణిలో భాగంగా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వుల్లో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అధికారులకు తెలియజేసినట్లు ఎక్కడా పేర్కొనలేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తించవని తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే బదిలీలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలకు ముందు జరిగిన వ్యవహారం ఏమిటో బయటికి వస్తే అసలు నిజాలు జనాలకు తెలిసే అవకాశం ఉంటుంది. దీనిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఏం సమాధానం చెబుతారో వేచిచూడాలి.

అడ్డగోలుగా డిప్యూటేషన్లు..?

వైద్యఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అయితే జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అడ్డగోలుగా డిప్యూటేషన్ల వ్యవహారం సాగుతున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు డిఎంహెచ్ఒ కార్యాలయంలో దాదాపు 25 మంది వరకూ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నట్లు సమాచారం. దీనిలో సీనియర్ అసిస్టెంట్లు, ఎంపిహెచ్ఒలు, ఎఫ్ఎన్ఒలు, ఎంఎన్ఒలు, ఫార్మాసిస్టులు సైతం ఉన్నట్లు తెలిసింది. పిహెచ్‌సిల్లో ఉద్యోగులను ఇష్టానుసారంగా డిప్యూటేషన్లపై మార్చడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు కుంటుపడుతున్న పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఫార్మాసిస్టు అవసరం లేకపోయినా ఇక్కడికి తెచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఎంపిహెచ్ఒ పోస్టు లేకపోయినా తెచ్చారని, సర్వీస్ ఇంజినీర్‌కు నిబంధనలకు విరుద్ధంగా ఎఒ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్ ఇంజినీర్‌కు ఎఒ బాధ్యతలు అప్పగించకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ నియమించినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల నియామకాల్లోనూ, బదిలీల్లోనూ, డిప్యూటేషన్లపై ఇలా అనేక విషయాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై కొంతకాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు దృష్టి సారిస్తే తప్ప ఇక్కడ సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కన్పించడం లేదనే చర్చ సర్వత్రా సాగుతోంది.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి మేరీప్రశాంతి

చెక్‌పోస్టుల బలోపేతానికి చర్యలు

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల బలోపేతం చేసేందుకు అంతర్రాష్ట్రాల పోలీసు సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి అంతర్రాష్ట్ర సరిహద్దు భద్రతను పెంచే దృష్ట్యా తెలంగాణ సరిహద్దు పోలీస్ సిబ్బందితో ఎస్‌పి మేరీ ప్రశాంతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్తగూడెం చెక్‌పోస్ట్ డిఎస్‌పిలు, ఎస్ఐలు, సిఐలతో ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి నిబంధనలు పాటించాలి

ఎన్నికల నియమావళి నిబంధనలు పాటించాలని ఎస్‌పి మేరీ ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ప్రచార కార్యక్రమాలు, రోడ్డుషోలు, ర్యాలీలు, సభలు నిర్వహించడం, మైక్‌సెట్‌లలో ప్రచారం చేయడం వంటి వాటన్నిటికీ ముందస్తు అనుమతి తప్పనిసరని చెప్పారు. అనుమతులు ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన సువిధ యాప్ నుంచి తీసుకోవాలని తెలిపారు. ఒక గ్రామంలో రెండు పార్టీలకు సంబంధించిన ర్యాలీలు, సభలు నిర్వహించడానికి ఒకే సమయంలో ఒకేరోజు అనుమతి ఇవ్వడం జరగదని చెప్పారు. ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థల వద్ద ఎటువంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతులు లేవని, కుల, మత వైశ్యాలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి ఎనిమిది గంటల తర్వాత ప్రచార కార్యక్రమాలకు ఎటువంటి అనుమతులు ఉండవని తెలిపారు. ప్రతిఒక్కరూ అనుమతులు పొంది శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలని ఎస్‌పి కోరారు.

గిరిజనులు, దళితులపై కేసు కొట్టివేత

హర్షం వ్యక్తం చేసిన బాధితులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘాలు సిపిఎం ఆధ్వర్యంలో 2005లో ధర్నా చేస్తుండగా గిరిజనులు, దళితులపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టి 19 సంవత్సరాలైంది. గురువారం కొవ్వూరు న్యాయస్థానం ఈ కేసును కొట్టేసింది. 15 మందిపై కేసు నమోదు చేయగా వారిలో ఏడుగురు మృతి చెందారు. ఇప్పటికైనా న్యాయాన్ని బయటికి తీసి గిరిజనులకు, దళితులకు న్యాయం చేశారని బాధితులు న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ఎ.ఫ్రాన్సిస్, కట్ట వెంకటేశ్వరరావు, పూనం వీరభద్రుడు, కొవ్వాడయ్య, సూర్యచంద్రం, బుచ్చన్న, మొక్కయ్య, లక్ష్మి, దుర్గారావు తదితరులు ఉన్నారు.



కేసు బాధితులు

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..!



వాలంటీర్ల ఆందోళన (ఫైల్‌ఫొటో)

- గందరగోళంలో గ్రామ, వార్డు వాలంటీర్లు
- ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరిక
- మరోపక్క అధికార పార్టీ ఒత్తిళ్లతో సతమతం
- ఉణుదుర్రులో 9 మంది వాలంటీర్ల తొలగింపుతో ఉలిక్కిపాటు

ప్రజాశక్తి - భీమవరం

ఒకపక్క వాలంటీర్లు ఎన్నికల విధులకు, ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టీకరణ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోపక్క ఎన్నికల ప్రచారానికి ఏదోక రూపంలో రావాలని అధికార పార్టీ నేతల ఒత్తిడి.. వెరసి గ్రామ, వార్డు వాలంటీర్లు లబోదిబోమంటున్నారు. దీంతో వాలంటీర్ల పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక నుయ్యి' అనే చందంగా తయారైంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని జిల్లాలో తొమ్మిది మంది వాలంటీర్లను ఇప్పటికే కలెక్టర్ విధుల నుంచి తొలగించారు. దీంతో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు.

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను నెలకొల్పింది. ఈ రెండు వ్యవస్థలను ముఖ్యమంత్రి జగన్ తన మానస పుత్రికలుగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల మంది గ్రామ, వార్డు వాలంటీర్లు పని చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రతినెలా రూ.5 వేలు పారితోషికం చెల్లిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల అమలులో వాలంటీర్ల వ్యవస్థ కీలకంగా వ్యవహరించింది. వివిధ సంక్షేమ పథకాలు అమలులో వీరు కీలకంగా వ్యవహరించారు. వైసిపి నేతలు, కార్యకర్తలకూ ఇవ్వని ప్రాధాన్యతను వాలంటీర్లకు ప్రభుత్వం కల్పించింది. అయితే మొదట్లో ఈ వాలంటీర్ల వ్యవస్థపై వైసిపి నేతల నుంచే వ్యతిరేకత వచ్చినప్పటికీ ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. వివిధ సందర్భాల్లో వాలంటీర్లకు ఉత్తమ సేవల పేరుతో అవార్డులు, నగదు బహుమతులను సైతం ప్రభుత్వం అందించింది. వాలంటీర్ వ్యవస్థపైనే వైసిపి ప్రభుత్వం ప్రధాన ఆధారంగా పరిపాలనను సాగించిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎన్నికల్లో సైతం వాలంటీర్లను ఉపయోగించుకునేందుకు సిద్ధమైంది. అయితే వాలంటీర్ల నియామకమే చట్ట వ్యతిరేకమని, వీరు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ కడప జిల్లాకు చెందిన ఒక వ్యక్తి కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో వాలంటీర్ల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందిగా అంటూనే ఎన్నికల విధుల్లో పాల్గొకూడదని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు రావడంతో వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే వాలంటీర్లు స్వచ్ఛంద సేవకులు అని, పూర్తికాల ప్రభుత్వ ఉద్యోగులు కాదు కాబట్టి వారికి ఎన్నికల కోడ్ వర్తించదని వైసిపి వాదిస్తోంది. వాలంటీర్లు పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినప్పటికీ, ప్రభుత్వ సంఘటిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచే గౌరవ వేతనం అందుకుంటున్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ ఇలా పేరు ఏదైనప్పటికీ గౌరవ వేతనం, జీతం, రెమ్యునరేషన్ ఇలా తీరు ఏమైనప్పటికీ ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి డబ్బులు తీసుకుని పని చేసే వారంతా పబ్లిక్ సర్వెంట్ కిందకే వస్తారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. వీరందరికీ 'కోడ్ ఆఫ్ కాండక్ట్' వర్తిస్తుందని, వాలంటీర్లకు దీనిలో మినహాయింపేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాలంటీర్లను వెంటాడుతున్న కేసుల భయం

కోర్టు ఆదేశాలు.. ఎన్నికల సంఘం హెచ్చరికలతో వాలంటీర్లను కేసుల భయం వెంటాడుతుంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 123, 129, 134ఎ సెక్షన్లతోపాటు ఐపిసి 171(ఎఫ్) ప్రయోగించే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. నియమావళిని ఉల్లంఘించే వాలంటీర్లపై ఆ సెక్షన్ల కింద కేసులు పెట్టాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. సెక్షన్ 123 ప్రకారం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం నేరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించినా, వారికి ఓటేయాలంటూ ప్రభావితం చేసినా సెక్షన్ 129 ప్రకారం కేసు నమోదు చేయవచ్చు. సెక్షన్ 134ఎ ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు ఎవ్వరూ పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకూడదని చట్టం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లందరికీ ఈ సెక్షన్లు వర్తిస్తాయని, వీటిని ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసి శిక్షించవచ్చునని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

తొమ్మిది మంది వాలంటీర్లపై వేటు

ఉండి మండలం ఉణుదుర్రు గ్రామ సచివాలయంలో పని చేస్తున్న తొమ్మిది మంది వాలంటీర్లపై వేటు వేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు అభియోగాలు రుజువు కావడంతో సార్వత్రిక ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద తొమ్మిది మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగించారు. ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఫొటోలతో సహా రుజువు కావడంతో విచారణ అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాలంటీర్లలో గుబులు నెలకొంది. కొంతమంది వాలంటీర్లు సొంతంగానే ప్రచారంలో బహిరంగంగా పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. రాని వాలంటీర్లపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.

విధి, విధానాలపై స్పష్టత కరువు

ప్రస్తుతం ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటికీ వాలంటీర్ల విధివిధానాలపై ఇప్పటివరకు కనీస స్పష్టత రాలేదు. వాలంటీర్లు నిర్వర్తించాల్సిన విధులేమిటీ, ఏ పని చేయాలి, ఏమి చేయకూడదు తదితర అంశాలపై ఇప్పటికీ అయోమయం కొనసాగుతోంది. దీనిపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని, పార్టీలకు ఏజెంట్లుగా ఉండకూడదని మాత్రమే ఎన్నికల సంఘం తెలిపింది. మిగిలిన అంశాలపై ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. ఉన్నతాధికారుల నుంచి సచివాలయ అధికారుల వరకూ వాలంటీర్ల విధులపై నిర్ధారణకు రాలేకపోతున్నారు. కేసులు భయం వెంటాడుతుండడంతో రాబోయే రోజుల్లో తమకు ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూములపై హక్కులు సాధించే వరకూ పోరు

పత్తేపురం బాధితులకు సిపిఎం బృందం పరామర్శ

ప్రజాశక్తి - నిడమర్రు

నివాస భూములకు హక్కులు సాధించే వరకు పోరాటం సాగిస్తామని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. మండలంలోని పత్తేపురంలో గురువారం సిపిఎం బృందం పర్యటించింది. నివాస భూములపై హక్కులు కోల్పోయిన వారిని పరామర్శించి, ఆ భూములను పరిశీలించారు. నివాస భూములపై హక్కులు సాధించేవరకు బాధితులందరికీ సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం, గణపవరం సబ్ రిజిస్ట్రార్‌కు ఈ సమస్యపై వినతిపత్రాలు అందించి న్యాయం చేయాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికీ అధికారులు స్పందించని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కానూరు రాజు, చిలువూరు వరలక్ష్మి, పెన్మెత్స సత్యానారాయణ, వేగేశ్న తాతరాజు, నడింపల్లి రామకృష్ణ, పేరిచర్ల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న రమణారావు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

త్వరలో జరగబోయే ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబర్ 9491041435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీన్ని వినియోగించుకుని ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

సి-విజిల్ ఫిర్యాదు బహిర్గతంపై కలెక్టర్ సీరియస్

ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

ఎంపిడిఒకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - ఏలూరు

సి-విజిల్ ఫిర్యాదు బహిర్గతం ఘటనకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చేబ్రోలు గ్రామ సచివాలయం-1 కార్యదర్శి బివి.రవిచంద్ర కుమార్, ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్-కం-టైపిస్ట్ బి.అమృతలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉంగుటూరు ఎంపిడిఒ శర్మకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. సి-విజిల్ ఫిర్యాదు బహిర్గతం కావడంపై విచారణ చేశామని, సంబంధిత పంచాయతీ సెక్రటరీ ఎంసిసి నోడల్ అధికారి అయిన ఎంపిడిఒకు పంపగా, సదరు స్క్రీన్‌షాట్‌ను ఎంపిడిఒ పంచాయతీ సెక్రటరీ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారని తెలిపారు. ఈ స్క్రీన్‌షాట్‌ను చేబ్రోలు పంచాయతీ సెక్రటరీ ఒక పార్టీ వ్యక్తికి చేరవేయడాన్ని తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయాధికారులు నిరంతర విద్యార్థులే

మార్పులు, ఇతర అంశాలపై అవగాహన అవసరం

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్‌హబీబ్ భాషా

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయాధికారులు, సిబ్బంది నిరంతర విద్యార్థులుగా మారి మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులు, ఇతర అంశాల పట్ల అవగాహన కల్పించుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్ హబీబ్ బాష కోరారు. భీమడోలులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది, గ్రామ సచివాలయాల వ్యవసాయ సహాయకులకు వారు చేపడుతున్న పనులు పట్ల అవగాహన, పథకాల అమలుపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా షేక్ హబీబ్ బాష మాట్లాడుతూ వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు గల అపార అనుభవ పాఠాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యాపరంగా, ఉద్యోగిగా వ్యవసాయం గురించి తాము నేర్చుకున్న అంశాలు, అనుభవాలు, అవగాహన పట్ల రైతులతో చర్చించాలని కోరారు. పశువులు, పక్షులు తమ జీవన విధానంలో అమలు చేసే క్రమశిక్షణ తరహాలో విధి నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సిబ్బందికి క్షేత్రస్థాయి అనుభవం ప్రధానమని, దీని పట్ల తమకు సలహాలు, సూచనలు అవసరమైతే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. ఇదే క్రమంలో వివిధ పంటలు, అధునాతన సాగు విధానాలు, వాటిని ఆశించే చీడపీడల పట్ల అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, సొమ్ముల చెల్లింపు విషయమై సాంకేతిక పరంగా ఏర్పడిన ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రసాయన ఎరువులను అవసరం మేరకు వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కొన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మకాలు జరిపినా సొమ్ములు తిరిగి జమ కాకపోవడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భీమడోలు ఉంగుటూరు వ్యవసాయాధికారులు ఉషారాణి, వెంకటేష్ తమ మండలంలో అమలులో ఉన్న వివిధ పథకాలు, పంటల ప్రగతిపై జిల్లా వ్యవసాయాధికారికి తెలిపారు. జిల్లా అధికారి కార్యాలయానికి చెందిన సాంకేతిక సహాయకులు గౌస్ బాషా, ప్రవీణ్ పాల్గొని రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పలు పథకాల అమలులో పరిష్కారం కాని సమస్యల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయ, దాని అనుబంధ శాఖల సిబ్బంది హాజరయ్యారు.




పలు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

ప్రచారానికి అనుమతులు పొందేందుకు సువిధ యాప్

ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించి వివిధ అనుమతులను సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసి పొందవచ్చని ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి చెప్పారు. గురువారం స్థానిక స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఎన్నికల సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కంటి మాట్లాడుతూ సువిధ ఆన్‌లైన్ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార నిమిత్తం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. రాజకీయపక్ష ప్రతినిధులు కూడా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించి అధికారులకు సహకరించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ వి.మురార్జీ, ఫైర్ డిపార్టుమెంట్ వి.ఆంజనేయులు, ఆర్‌టిఒ కె.శ్రీహరి, మున్సిపల్ అధికారి ఎమ్‌డి.సిరాజుద్దీన్, సిఐఎం రాజశేఖర్, ఆర్అండ్‌బి నుంచి పివి అప్పారావు, విద్యుత్ శాఖ నుంచి ఎస్.శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.




పాలిప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

పాలి ప్రసాద్ మృతి తీరని లోటు

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాలి ప్రసాద్ సంతాప సభ స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేసిన పాలి ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబసభ్యులకు పార్టీ అండదండలు ఉంటాయని తెలిపారు. పాలి ప్రసాద్ ప్రతిరోజూ తొమ్మిది గంటలకే పార్టీ కార్యాలయానికి వచ్చి సాయంత్రం వరకు ఆఫీస్‌లో ఉండి బాధ్యతలు సక్రమంగా నిర్వహించేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ కొండ్రెడ్డి విశ్వనాథం, ఉప్పాల జగదీష్‌బాబు, కొక్కిరిగడ్డ జయరాజు, పాకాలపాటి గాంధీ, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి చందు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న విజయరాజు

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని అంకాలంపాడు గ్రామంలో గ్రామ వాలంటీర్ గొల్లపూడి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు గురువారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు కుటుంబానికి అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని విజయరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్‌బాబు, కామవరపుకోట ఉప సర్పంచి మేదురి రంగబాబు, ఎంపిటిసి సభ్యులు గొరిక ప్రశాంత్, వడ్లపట్ల చిన్నబ్బులు, పెనుబోయిన శ్రీను, నెక్కలపు వసంతరావు, నిజవరపు రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామ సర్పంచి దేవరపల్లి రామోహ్నరావు మనవడు కృష్ణసాయికార్తికేయ(14) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు గురువారం పరామర్శించారు. బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్ బాబు, మేదురి రంగబాబు ఉన్నారు.

ప్రశ్నార్థకంగా మార్కెట్ యార్డ్ నిర్మాణం

రైతు సంఘం మండల కార్యదర్శి రాంబాబు


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో మార్కెట్ యార్డ్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని రైతు సంఘం మండల కార్యదర్శి బొద్దు రాంబాబు అన్నారు. పట్టణంలో 2020లో ఎంఎల్ఎ ఎలిజా మార్కెట్ యార్డ్ నిధులు రూ.32 లక్షలతో యార్డ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. శంకుస్థాపన చేసిన నాలుగేళ్లవుతున్నా ఇప్పటివరకు రైతు బజార్ ఒక ప్రశ్నార్థకంగానే ఉండిపోయిందన్నారు. పట్టణ ప్రజలకు ఏమాత్రం సౌకర్యం లేకుండా పోయిందన్నారు. ఇది వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. గుత్తేదారులు పనులు ప్రారంభించి పునాదులు వేశారన్నారు. నిధులు విడుదల అవ్వడంలేదని పనులు నిలిపివేశారని చెప్పారు. పునాది వేసిన మార్కెట్ సిమెంట్ దిమ్మలు చెల్లాచెదరై, తుప్పలతో నిండిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

టిడిపి నేత విజయ్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - కలిదిండి

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చాబత్తిన విజయ్‌కు మాతృ వియోగం కలిగింది. మండలంలోని పెదలంకలో సుశీలమ్మ చిత్రపటానికి డాక్టర్ సిపిఎల్.వెంకట్రావు, ప్రజా రక్షణ ఐక్య వేదిక కార్యదర్శి ఎల్ ఎస్.భాస్కరరావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శాంతకుమార్, ఉపాధ్యక్షులు బేతపూడి ఉంబి, కార్యదర్శి కొండపల్లి రవివరప్రసాద్, ట్రెజరర్ దాకారపు వినోద్ కుమార్ నివాళులర్పించారు.



సుశీలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కార్యకర్తలకు అండగా ఉంటా

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కార్యకర్తలకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మాదు కోటేశ్వరరావును ఆయన గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు నరదల రాంబాబు, కూరాకుల పంగిడేశ్వరరావు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికపై దేవాదాయ శాఖ ఉద్యోగి లైంగిక వేధింపులు

రిమాండ్‌కు నిందితుడు

ప్రజాశక్తి - కామవరపుకోట

బాలికపై దేవాదాయ శాఖ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తడికలపూడిలో దేవాదాయ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బైపినీడి లక్ష్మీనరసింహరావు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాలిక తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు లక్ష్మీనరసింహరావుపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ జయబాబు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిఎస్‌పి జనార్ధన్‌నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలంలోని వేగివాడ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.67,950 నగదు, 11 మోటార్ సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

భీమడోలులో ఎంఎల్ఎ వాసుబాబు పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు గురువారం మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా చెట్టున్నపాడు గ్రామానికి సందర్శనకు వెళ్లిన ఆయన గ్రామ సర్పంచి జల్లూరి వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులను కలిశారు. సర్పంచి అత్త చనిపోయారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్పంచి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ రక్తదానం పట్ల గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఆర్‌సి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించే బాధ్యతను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆర్.పార్థసారథి, హెల్త్ అసిస్టెంట్ పి.అంజలి, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ఎన్.సూర్యకుమారి, ఎఎన్ఎం విద్యార్థులకు ఆరోగ్యపరమైన సూచనలు చేసి బ్లడ్ గ్రూపింగ్ చేశారు. 60 మంది కళాశాల విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ చేసి రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. విద్యార్థులు రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ఆగని ప్రమాదాలు

అధ్వానంగా రహదారి
ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏరియా ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో ఆచార్య భరద్వాజ నగర్ దగ్గర నుంచి శ్రీనివాసపురం హైవే వరకు రోడ్డంతా గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు రోడ్డుపై గుంతల్లో పడి ప్రమాదాలకు గురవతున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు అధ్వానంపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమీపిస్తున్నందున ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి అధ్వాన స్థితిలో ఉన్న రోడ్డుపై గుంతలను పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు



ఆగిరిపల్లి : వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో భీమడోలు మండల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమల్లోకి వచ్చిందని నోడల్ అధికారి, భీమడోలు ఎంపిడిఒ టి.స్వర్ణలత తెలిపారు. దీని అమలు కోసం పనిచేస్తున్న ఎంసిసి బృందాలు ఇప్పటివరకు 1286 అభ్యంతరకర అంశాలను తొలగించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులపై ఉన్న 128 గోడ రాతలు, 435 పోస్టర్లు, 337 బ్యానర్లు, 386 ఇతరాలు తొలగించినట్లు తెలిపారు. 1008 ప్రభుత్వ ఆస్తులు, 278 ప్రయివేట్ ఆస్తులపై ఇవి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

ముసునూరు : ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం అనుమతులు లేకుండా రాజకీయ సభలు నిర్వహించరాదని తహశీల్దార్ బాజీ, ఎస్ఐ పి.వాసు, ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక రాజకీయ సభలు, ర్యాలీలు నిర్వహించినా అనుమతి లేకుండా మైక్‌లు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించినా, రాజకీయ కార్యక్రమాలను నిర్వహించి, వాటిలో వివాదాలు చెలరేగినా, గొడవలు పడినా సదరు కార్యక్రమాలను నిర్వహించిన రాజకీయ నాయకులపై, అనుమతి లేకుండా తిరిగిన మైక్, వాహనంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆగిరిపల్లి :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని, ఎటువంటి చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా మండలంలోని సింగన్నగూడెం బస్టాప్ వద్ద ఆయన గురువారం చెకింగ్ స్వాడ్ టీంతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

తెల్లారితే పెళ్లనగా అగ్నిప్రమాదం

దగ్ధమైన డబ్బు, పెళ్లి బట్టలు, నిత్యావసర వస్తువులు
ఆర్థిక సాయం అందించిన చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

తెల్లారితే తన మనవరాలి పెళ్లి అని వృద్ధురాలు సంతోషంగా ఉంది. ఈ క్రమంలో ఆ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మనవరాలి పెళ్లి దాచిన డబ్బు, పెళ్లి బట్టలు, నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన దెందులూరు మండలంలోనరి సీతంపేట పంచాయతీ సింగవరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట పంచాయతీ సింగవరానికి చెందిన వృద్ధురాలు నారాయణపురం రమణమ్మ మనవరాలి పెళ్లి తెల్లారితే గురువారం జరగనుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో గ్యాస్‌బండ లీకై మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని తన మనవరాలి పెళ్లి కోసం దాచిన డబ్బు, పెళ్లి బట్టలు, నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ బాధితులను పరామర్శించి వారికి అండగా నిలిచారు. తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సాయం, పలు గృహ అవసర సామగ్రిని అందించారు. రమణమ్మ మనవరాలిని ఆశీర్వదించి పెళ్లి కానుక అందించారు. ఆయనతో పాటు టిడిపి గ్రామ అధ్యక్షులు చలమలశెట్టి లక్ష్మీకుమార్ (రమణయ్య), క్లస్టర్ ఇన్‌ఛార్జి పరసా వెంకట్రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పర్వతనేని రామకృష్ణ, పార్టీ గ్రామ సెక్రటరీ బాలిన హరికృష్ణ, మురిపాక శ్రీనివాస్, చల్లారి మద్ది రామయ్య, సరిగే నాగబాబు, షేక్ బాజీ, వెలివెల శివ, లావేటి రమణ, బూర్ల రాము, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి పరామర్శ

ప్రమాద బాధితురాలు రమణమ్మ కుటుంబాన్ని దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే రాయితీలను త్వరితగతిన అందేం దుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రమణమ్మ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం బాధితు రాలి కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - ముసునూరు

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ గద్దె రఘుబాబు, మండలాధ్యక్షులు దేవినేని ఢలరామ్, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మసీముకు సుబ్బారావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రంగయ్య గురువారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులందరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో ఎస్ఐ వెంకన్న తన సిబ్బందితో కలిసి గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఒక వ్యక్తి వద్ద 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పెద్దింట్లమ్మ ప్రభల ఉత్సవం

కైకలూరు : పెద్దింట్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రభల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ పందిరిపల్లిగూడెం నుంచి అమ్మవారి ఆలయం వరకు ప్రభ ఉత్సవ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ సీతారాములను దర్శించుకున్నారు. వీరితో పాటు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఏసురాజు, వరప్రసాద్, గ్రామ సర్పంచి బలే వెంకటరమణ సముద్రుడు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ముంగర నరసింహరావు, ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్

ప్రజాశక్తి - భీమడోలు

రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని భీమడోలు సిఐ బిబి.రవికుమార్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో భీమడోలు పోలీసులు, పారా మిలటరీ బలగాలు గురువారం సాయంత్రం మండలంలోని భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శిక్షణ డిఎస్‌పి విద్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్‌సిబ్బంది

పోలాసిగూడెంలో విజయరాజు పర్యటన

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట మండలంలోని పోలాసిగూడెం గ్రామంలో వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఇప్పటి నుంచే బూత్ కమిటీ సభ్యులంతా కష్టపడి పనిచేయాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఓటూ వైసిపికి పడేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయని విజయరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్‌బాబు, మేడురి రంగబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం గ్రామంలో సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నేతలతో ఆయన గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పోలవరం నియోజకవర్గంలో ఈ ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వంలో చేసిన మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. సిఎం జగన్ అధికారం చేపట్టాక సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా పరిపాలను ఇంటి వద్దకేఉ తీసుకొచ్చామన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి తేడా వివరించాలన్నారు. పోలవరం నియోజకవర్గంలో తెల్లం రాజ్యాలక్ష్మి బాలరాజును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఎంపిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, జెసిఎస్ కన్వీనర్లు, గ్రామ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు ఎలాంటి సంబంధం లేదు

సామాజిక మాధ్యమాల్లో తిమ్మన్నగూడెం బాధితుడి వీడియో చక్కర్లు

ఏలూరు టౌన్ :తిమ్మన్నగూడెం ఘటనకు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరికి ఎటువంటి సంబంధం లేదని బాధితుడు చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ఘటనలోకి టిడిపి వాళ్లు అన్యాయంగా లాక్కొచినట్లు బాధితుడు చెబుతున్నట్లు వీడియోలో ఉంది. టిడిపి వాళ్లు కావాలని తనను ఇందులోకి లాగి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టిడిపి వాళ్లు ప్రచారం చేసున్నట్లుగా తనను ఎవరూ కొట్టలేదని, అదంతా తప్పుడు ప్రచారమని చెప్పారు.

ఐక్యతకు ఆదర్శం పోలవరం ప్రెస్‌క్లబ్

డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి

పోలవరం :జర్నలిస్టుల ఐక్యతకు ఆదర్శం పోలవరం ప్రెస్‌క్లబ్ అని డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి అభినందించారు. పోలవరం ప్రెస్‌క్లబ్ మూడో వార్షికోత్సవం సందర్భంగా పట్టిసీమలో స్థానిక రివర్ ఇన్ అతిథి గృహంలో గురువారం నిర్వహించిన సభలో డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా జర్నలిస్టుల మధ్య ఐక్యత నెలకొల్పుతూ విజయవంతంగా ప్రెస్‌క్లబ్‌ని ముందుకు నడిపిస్తున్న అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్‌ని అభినందించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు డిఎస్‌పి, సీనియర్ జర్నలిస్టులు అల్లం శ్రీను, పీసపాటి వ్యాఘ్రేశ్వరరావులను సత్కరించారు. అనంతరం మానవతాధీర అవార్డు గ్రహీత షేక్ షెహిన్నా బాషాను శాలువ కప్పి సత్కరించారు.

జంగారెడ్డిగూడెం అభివృద్ధి చెందాలి

అనన్య చిత్ర యూనిట్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఏరియా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మెట్ట ప్రాంతాల్లో చిత్రాన్ని పూర్తి చేసినట్లు అనన్య చిత్ర దర్శకుడు ప్రసాద్, నిర్మాణ సత్యనారాయణ తెలిపారు. గురువారం చిత్ర యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అనన్య చిత్రం ఈ నెల 22వ తేదీన ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విడుదల చేస్తామని తెలిపారు. ప్రేమ, హర్రర్ కామెడీతో కూడుకున్న చిత్రమని చెప్పారు. ఈ సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించాలి

ప్రజాపంథా

ప్రజాశక్తి - వేలేరుపాడు

రానున్న ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించేవని, మతవాద పాసిస్టు బిజెపిని, దానికి ప్రత్యక్ష, పరోక్ష భాగస్వాములైనవాటిని ఓడించాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి పోటు రంగారావు, ఆల్ ఇండియా నాయకులు కెచల రంగారెడ్డి పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోలవరం నియోజగర్గం నుంచి పోటీ చేస్తున్న న్యూడెమోక్రసీ అభ్యర్థికి ప్రజాపంథా మద్దతు ఉంటుందన్నారు. వేలేరుపాడులో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, రాష్ట్ర నాయకుల షేక్ గౌస్, కెచ్చుల కల్పన, జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బాసిన సత్యనారాయణ, ముత్యాలరావు, డివిజన్ నాయకులు కె.వీరస్వామి, కె.ముత్యాలరావు, సోయం చంద్రరావు, కె.కన్నయ్య మల్లేష్, ఎంపిటిసి సభ్యులు కె.రత్తమ్మ, సర్పంచి సోడే విజయ, పిఒడబ్ల్యు నాయకురాలు ఎస్‌కె మున్ని పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో రాష్ట్రం అధోగతి'

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి హయాంలో అభివృద్ధి లేకపోవటంతో రాష్ట్రం అధోగతిపాలైందని, దెందులూరు నియోజకవర్గంలో సైతం జరుగుతున్న అక్రమాలు, అవినీతిని చూసి సహించలేక తామంతా వైసిపిని వీడి చింతమనేని ప్రభాకర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ టిడిపిలో చేరామని పెదవేగి మండలం చక్రాయగూడెం పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. దుగ్గిరాలలోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీతారామపురం గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ వారికి పార్టీ కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పెదవేగి మండలాధ్యక్షులు బొప్పన సుధా, సెక్రటరీ మాదు రవి, గ్రామ అధ్యక్షులు గొర్రెల సుధాకర్, సీనియర్ నాయకులు దొరరాజు శ్రీనివాసరాజు, కెవి.కృష్ణారావు, గొర్రెల నరేంద్ర పాల్గొన్నారు.